క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

లోకేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న సురేశ్

కడెం: నేషనల్ హ్యూమన్ రైట్స్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పెద్దూర్ తండాకు చెందిన గుగ్లావత్ సురేశ్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు మంగళిపెల్లి హుస్సేన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని సురేశ్ పేర్కొన్నాడు. గుగ్లావత్ శ్రీనివాస్, విశ్వనాథ్ ఉన్నారు.

బోరుకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో భీమన్న దేవుడి ఆలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. బోరు పనిచేయడం లేదని స్థానిక కౌన్సిలర్ నాయిని స్రవంతి సంతోష్.. చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన చైర్మన్ బుధవారం సిబ్బంది చేత మరమ్మతు చేయించి తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జన్నారపు శంకర్, కాలనీవాసులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నర్సయ్య

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని వార సంతలో బుధవారం గ్రామస్తులకు రోడ్డు భద్రతపై ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదం అని సూపర్‌వైజర్ ఎల్.నర్సయ్య పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌లో గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకొని బస్సువేళలు, బస్సు ఎక్కడ ఉంది వంటి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భూమిపూజ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం ఎదుట బుధవారం ఏకలవ్యుడి విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు భూమిపూజ చేశారు. ఏకలవ్య సంఘం, లోకేశ్వరం వీడీసీ ఆధ్వర్యంలో ఈ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు శ్రీనివాస్, కుమ్మరి విఠల్, ఏకలవ్య సంఘం మండలాధ్యక్షుడు కూతడి సురేశ్, ఉపాధ్యక్షుడు గంగాధర్, నవీన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

సాక్షి స్పందన

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ ఎస్సీ కాలనీలో పేదకుటుంబానికి చెందిన కొమిరె వరుణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయమై గత నెల 26న సాక్షిలో 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వరుణ్‌తో కలిసి 2016–17లో ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులు తమ వంతుగా రూ.8వేలను బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లతో పోలీసులు

సారంగాపూర్: మండల కేంద్రం సమీపంలోంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు బుధవారం గ్రామంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అనుమతుల్లేకుండా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం వాహనాలను తహసీల్దార్ శ్రీదేవికి అప్పగించామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.



లక్ష్మణచాంద: వద్యాల్‌లో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు



సోన్ మండలం కద్తాల్‌లో..



నిర్మల్‌టౌన్: శాంతినగర్ రామాలయంలో..

రాములోరి కల్యాణం

జిల్లావ్యాప్తంగా బుధవారం శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రామాలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హిందూవాహిని ఆధ్వర్యంలో రాముడి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించగా యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఖానాపూర్‌లో జడ్జి నితిన్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సత్యం పూజలు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



సారంగపూర్: జామ్‌లో కల్యాణం తిలకిస్తున్న ప్రజలు



కుభీర్‌లోని శివాలయంలో..



నర్సాపూర్(జి) రామాలయంలో శ్రీహరిరావు, నేతలు



దిలావర్‌పూర్‌లో తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



కుంటాలలో కల్యాణం వద్ద స్వాములు



తానూరులో రాముడి ప్రతిమతో శోభాయాత్ర



నిర్మల్‌లోని బాగులవాడ రామాలయంలో సీతమ్మకు జీలకర్ర బెల్లం పెడుతున్న అర్చకుడు



కడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో..



భైంసాలో పూజల్లో ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, తదితరులు



భైంసారూరల్: దేగాంలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన అఖండ హరినామ సప్తాహం

తానూరు: మండలంలోని హంగిర్గాలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం బుధవారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యకీర్తనలో నాందేడ్ జిల్లాకు చెందిన తుకారాం మహారాజ్ పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలు వీడి భక్తిమార్గంలో నడిస్తే ప్రశాంతంగా ఉంటారని పేర్కొన్నారు. పలువురు భక్తులు తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి పగులకొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. కీర్తనలకు మండలంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు తరలివచ్చారు. సప్తాహంలో పాల్గొన్న మహారాజ్‌లను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ప్రారంభమైంది. నిర్మల్–మంచిర్యాల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని కనకాపూర్ వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి కనకాపూర్ సమీపంలోని అక్షర ఉన్నత పాఠశాల సమీపంలో లైట్లు ప్రారంభం కాగా గ్రామం నూతన శోభ సంతరించుకుంది.

మురుగు ఇలా.. రాకపోకలు ఎలా



గుంతలమయంగా రోడ్డు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై సాయిబాబా ఆలయం సమీపంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు నిలిచి రోడ్డు గుంతలమయంగా మారింది. కొందరు అనుమతించకపోవడంతో డ్రెయినేజీ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. తమ ఇంటి స్థలాల్లోకి మురుగు నీరు రాకుండా ఎక్కడికక్కడే కాలువకు అడ్డుకట్టలు వేయడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిని తొక్కుతూ ఆలయానికి వెళ్లే దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో డ్రెయినేజీ నిర్మాణానికి పైపులు తెప్పించి తవ్వకాలు జరిపించినా పనులు ముందుకు సాగలేదు. అధికారులు స్పందించి మురుగు కాల్వ నిర్మించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని స్థానికులు వాహనచోదకులు కోరుతున్నారు.



రోడ్డుపైకి మురుగునీరు

హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో దేవరకోట దేవస్థానం వద్ద హిందూవాహిని ఆధ్వర్యంలో రాములోరి శోభాయాత్రను నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. చింతకుంటవాడ, పాతబస్టాండ్, న్యూబస్టాండ్ మీదుగా శోభాయాత్ర సాగగా.. జైశ్రీరామ్ నినాదాలతో వీధులు మార్మోగాయి. కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు, జ్యూస్ అందజేశారు. ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రార్థనస్థలాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ వక్త శివకుమార్, నగర సంచాలక్ ప్రమోద్ చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించి భారతీయుల 500 ఏళ్ల కల ప్రధాని మోదీ నెరవేర్చారని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.



శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్

భైంసాలో..

భైంసాటౌన్: భైంసాలో హిందూవాహిని మహిషాశాఖ ఆధ్వర్యంలో రాముడు, భరతమాత చిత్రపటాలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక గోశాల వద్ద ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మోహన్‌రావు పటేల్, హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. ఏపీనగర్‌లోని రాంలీలా మైదానం వరకు శోభాయాత్ర నిర్వహించగా ప్రధాన వక్తల ప్రసంగాల అనంతరం కార్యక్రమం ముగిసింది. ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.



భైంసాలో గోశాల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎంపీ అభ్యర్థి నగేశ్

రైతులు పంటను దళారులకు అమ్ముకోవద్దు

లక్ష్మణచాంద: రైతులు తమ పంటను దళారులకు అమ్ముకోవద్దని కనకాపూర్ క్లస్టర్ ఏఈవో సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించుకోవాలని సూచించారు. వారి వెంట పలువురు రైతులు పాల్గొన్నారు.



కేంద్రం వద్ద ఏఈవో సంతోష్, రైతులు

కాంగ్రెస్ దిలావర్‌పూర్ మండల కార్యవర్గం

దిలావర్‌పూర్: కాంగ్రెస్ పార్టీ దిలావర్‌పూర్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడిగా తక్కల విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అర్గుల రమణ, ఉపాధ్యక్షులుగా దమ్మ రవీందర్‌రెడ్డి, సయ్యద్ యూసుఫ్, కోశాధికారిగా కోడె శ్రీనివాస్, కార్యదర్శులుగా నిమ్మ సాయన్న, బెల్లాజి రాజు, నరేశ్ ఎన్నికయ్యారు. సహకార్యదర్శులుగా రతన్, ప్రణీత్‌రెడ్డి, సికిందర్, వసంత్, విఠల్, ప్రకాశ్, రవీందర్, గంగన్న, శివకుమార్, లింగన్న ఎన్నికయ్యారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ షఫీయొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే.సలీం, ఎన్నికవగా బీసీ సెల్ అధ్యక్షుడిగా తెడ్డు గోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బొల్ల దయాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తోట నరేశ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడిగా పరశురాం పాటిల్ ఎన్నికయ్యారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సీతారామాంజనేయస్వామి ఆలయంలో నూతనంగా సీతారాముల ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. విజయవాడ వేదపండితులు వీరభద్రశర్మ, పండితులు కీర్తి రాఘవశర్మ, రాజశేఖర్‌శర్మ, రామకృష్ణశర్మ, ప్రహల్లాద్, ప్రవీణ్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎడ్ల నాగలితో దున్ని భూమిపూజ పనులు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు, నాయకులు జన్నారపు విజయలక్ష్మిశంకర్, నాయిని సంతోష్, అల్లాడి వెంకటేశ్వర్లు, సతీష్‌రావు దేశ్‌పాండే, ఆకుల శ్రీనివాస్, అయిందాల జనార్దన్, లాండేరి కిషన్,రాకేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బీజేపీలో చేరిక

నిర్మల్‌టౌన్: మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వ్యక్తిగత సోషల్ అండ్ డిజిటల్ మీడియా కన్వీనర్ ఆరే అన్వేశ్‌కుమార్ బుధవారం బీజేపీలో చేరారు. ఈసందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంద్రకరణ్‌రెడ్డి సామాజిక మధ్యమాలను అన్వేశ్ స్వయంగా నిర్వహించి, సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించేవాడు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి శ్రీకాంత్‌రెడ్డి, జుట్టు దినేశ్, విజయ్, సుంకరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

21న సీపీఎం సభ జయప్రదం చేయాలి

ఖానాపూర్: జిల్లాకేంద్రంలో ఈనెల 21న జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ కోరారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే విధానంపై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో మతోన్మాద దాడులు పెరగడంతోపాటు మేధావులు, ప్రజాస్వామికవాదులు హత్య గావించబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. సమావేశంలో డాకూరి తిరుపతి, తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య, చుంచుల నారాయణ, నలిమెల రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రుడు

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీరామచంద్రుని పాలన ఎప్పటికీ ఆదర్శ ప్రాయమేనని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి, శాంతినగర్ ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. శ్రీరాముడు పితవాక్కు పరిపాలకుడని రాజులు, రాచరిక వ్యవస్థ ఉన్న కాలంలోనూ సత్యం, న్యాయం, ధర్మంతో ప్రజల మాటకు విలువనిస్తూ, ప్రజాస్వామ్య పాలన చేసిన మహనీయ వ్యక్తి అన్నారు. ప్రస్తుతం ప్రజలకు మరింత జవాబుదారీతనంతో పాలన అందించాలన్నారు. సీతారాముల అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. వారి వెంట నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, అప్పాల గణేశ్ చక్రవర్తి, కౌన్సిలర్లు, నర్సాపూర్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, పూదరి అరవింద్, బురాజ్, కొంతం గణేశ్, రామకృష్ణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కుంటాలలో వర్షం

కుంటాల: మండలంలోని ఓలా, కుంటాల, కల్లూర్, అందాకూర్, అంబకంటి, లింబా(కె), లింబా(బి) గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. మొక్కజొన్న పంట కుప్పలు తడవకుండా కల్లాల ఎదుట టార్పాలిన్లు కప్పి జాగ్రత్తపడ్డారు. జొన్న పంట నల్లబడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమయ్యారు.



ఓలాలో మొక్కజొన్న పంట తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచిన రైతులు